## 17. ఖరీదైన బతుకు

బస్‌స్టాప్‌లో గంట నించి సిటీ బస్ కోసం వేచి ఉన్న ఒకతను ఫోర్డ్ కారులో వెళ్తున్న ఓ ధనవంతుడ్ని చూసి మనసులో అనుకున్నాడు.

"నాకా కారుంటే బావుండేది."

బస్టాప్‌లో నిలబడ్డ ఓ యోగి వెంటనే 'తథాస్తు' అని దీవించాడు.

చిత్రంగా సామాన్యుడి ఆత్మ వెంటనే ఆ ఫోర్డ్ కారు యజమాని శరీరంలోకి మారింది. కారు యజమాని ఆత్మ బస్టాప్‌లోని అతని శరీరంలోకి వెళ్ళింది.

నాలుగైదు గంటల్లోనే సామాన్యుడికి ఆ ధనవంతుడి జీవితం అంటే రోత పుట్టింది. బ్లాక్‌మనీ దాచుకోవడంలో టెన్షన్, స్వంత ఆదాయం గల మాట వినని భార్య, వ్యాపారంలో పార్టనర్స్‌ని మోసం చేయడానికి పథకాలు, అధిక ఆహారం వల్ల, టెన్షన్స్ వల్లా బలహీనమైన శరీరం...

సామాన్యుడు బస్టాప్‌కి తిరిగివెళ్ళి, తన పాత జీవితం తనకిమ్మని ఆ యోగిని ప్రార్థించాడు.

"నీలా బస్సులో ప్రయాణించేవాడికి లేని ఎన్నో సమస్యలు, ఖరీదైన కార్లలో ప్రయాణించే వారికుంటాయి. అలాంటివాటికి ఆశ పడితే వాటినీ నువ్వు భరించాల్సివుంటుంది జాగ్రత్త." హెచ్చరించాడు యోగి.

## 18. భగవదానుభవం

"మీరు భగవంతుడ్ని చూసారా?"

"చూసాను."

"అయితే నాకూ చూపించండి..."

"ఇదేమిటి నా చెవిని నలుపుతున్నారు? అబ్బ! నొప్పి. అలా నలపకండి."

"ఎక్కడ నొప్పి? నాకు కనబడటం లేదే? అదేమిటి? చెవిని కాదు నేను చూపించమన్నది...నొప్పిని."

"నొప్పిని ఎలా చూపించగలను స్వామీ? ఎవరికివారు అనుభవించే విషయం అది."

"భగవంతుడి విషయంలో కూడా అంతే జరుగుతుంది. ఎవరికి వారు అనుభవించి భగవంతుడ్ని చూడగలరు. భగవంతుడ్ని అనుభవించే దారిని పట్టుకోడానికి నేను సహాయం చేయగలను తప్ప భగవంతుడ్ని చూపించలేను."

## 19. విరాగి

ఓ అడవిలో, ఓ చెట్టు కింద ఒక యోగి తపస్సు చేసుకునేవాడు. అతని అలౌకిక సంపద గురించి విన్న ఆ దేశపు రాజు అతన్ని చూడటానికి వచ్చాడు. అయితే, అంతకు ముందురోజే ఆ యోగి హిమాలయాలకి వెళ్ళాడని తెలిసి ఆయన దర్శనం కలగనందుకు బాధ పడ్డాడు.

ఆయన వచ్చేలోగా ఆయన కోసం అక్కడ ఓ విశాలమైన మందిరాన్ని నిర్మించాడు. మూడేళ్ళ తర్వాత తిరిగి వచ్చిన యోగి తను కూర్చునే చెట్టు స్థానంలో ఉన్న ఆ మందిరాన్ని చూసాడు.

"రాజుగారు మీకోసమే దీన్ని కట్టించారు." చెప్పారు కాపలావాళ్ళు యోగితో.

బ్రహ్మజ్ఞానం తప్ప ఇంకే కోరికా లేని ఆ యోగి ఎంతో నిర్లిప్తంగా, నిరాసక్తంగా ఆ మందిరానికి దూరంగా ఉన్న ఇంకో చెట్టు కింద కూర్చుని తపస్సు చేసుకోసాగాడు.

## 20. యోగి-సంసారి

బ్రహ్మజ్ఞాన అన్వేషణలో ఇల్లు వదిలి వెళ్ళిపోయిన ఒకతని తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు అతని కోసం విలపించారు.